17012025-DIS-04_Layout 1 1/17/2025 3:52 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కేసుల్లో దొందూదొందే!

ఫార్ములా-ఈ పేరిట జరుగుతున్న దర్యాప్తుల తతంగం వెనుకనున్న మర్మం ఇప్పటికే అందరికీ అర్థమైపోయింది. ఓ అంతర్జాతీయ ఈవెంట్‌ను రాష్ట్రానికి రప్పించి పేరుప్రతిష్ఠలు పెంచేందుకు, పారిశ్రామికంగా తోడ్పాటు అందించేందుకు జరిగిన సదాశయ ప్రయత్నమిది. పైగా అందులో ఎలాంటి గోప్యత లేదు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు చుట్టూ ఏదో కథ అల్లాలనే కుతంత్రం స్పష్టంగా గోచరిస్తున్నది. ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం కేంద్ర-రాష్ట్రాల సయోధ్య. ఒకరు ఇదిగో పులి అంటే ఇంకొకరు అదిగో తోక అంటున్నారు. కేవలం రూ.55 కోట్ల వ్యవహారం. అదీ ఖాతా నుంచి ఖాతాకు మధ్య జరిగిన లావాదేవీ. ఇటు రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలోని ఏసీబీ కేసువేస్తుంది. అటు కేంద్రం కనుసన్నల్లో పనిచేసే ఈడీ దర్యాప్తు అంటూ రంగంలోకి దిగుతుంది. తానా అంటే తందానా అన్నట్టు చెట్టపట్టాలేసుకుని కేసులు పెడుతున్నారు. బీజేపీ-కాంగ్రెస్ మిలాఖత్‌కు ఇంత కన్నా రుజువులేమి కావాలి. రెండింటి మధ్య కేసులు, దర్యాప్తుల విషయంలో కనిపిస్తున్న సమన్వయం విస్మయం కలిగిస్తున్నది. దర్యాప్తు పేరిట ఏదో తవ్విపోస్తున్నట్టు హంగామా చేస్తుండటం విచిత్రం. ఇది రాజకీయ కక్షసాధింపు వ్యవహారమని పైకి తెలిసిపోతూనే ఉంది. బీజేపీ ప్రతిపక్ష పాత్రను పోషించి ప్రభుత్వాన్ని నిలదీయాలి. కానీ అలా చేయకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నది. ఇది బీజేపీ-కాంగ్రెస్ మిలాఖత్‌కు మరో నిదర్శనం. రాష్ట్రంలో ఓ మంత్రికి చెందిన నివాసాల్లో, కార్యాలయాల్లో ఈడీ దాడులు చేసింది. నోట్ల లెక్కింపు యంత్రాలూ వినియోగించినట్టు వినికిడి. కానీ సోదాలు ఎందుకు జరిపిందీ, ఎంత డబ్బు దొరికిందీ బయటకు రాలేదు. దర్యాప్తుల్లో మనవాళ్లు, పైవాళ్లు అనే తేడాలున్నాయా? రాత్రికిరాత్రే పార్టీలు, విధేయతలు మారితే అవినీతిపరులు పులుకడిగిన ముత్యాలు అవుతారా?

11 ఏండ్ల మోదీ పాలనలో జరిగిన సంస్థల దుర్వినియోగం ఒక ఎత్తయితే రేవంత్ ఏడాది పాలనలో జరుగుతున్న కేసుల బనాయింపు మరొక ఎత్తు. విపక్ష రాజకీయ వేత్తలను ఇరకాటంలో పెట్టేందుకు మోదీ ప్రభుత్వం చేతిలో సీబీఐ, ఈడీ వంటి సంస్థలు సాధనాలుగా మారడం మనం చూస్తూనే ఉన్నాం. ఆ దర్యాప్తులు దరిజేరవు. కేసులు కడతేరవు. వేధింపులు మాత్రం కొనసాగుతూనే ఉంటాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఉదంతమే తీసుకుందాం. ఇది వరకే ఆయన జైలుకు వెళ్లి అతికష్టం మీద బెయిలుపై బయటపడ్డారు. ఇప్పుడు ఎన్నికల వేళ మరోసారి ఆయనపై ఈడీ విచారణకు కేంద్రం అనుమతించడం ఎందుకో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. మనసులో ఏదో పెట్టుకుని బురద జల్లుతున్నారు. అక్కడ ఎన్నికల్లో ప్రచారం చేసుకోకుండా అడ్డుకుంటే, ఇక్కడ రాజకీయ ప్రత్యర్థులు ప్రశ్నించకుండా గొంతు నొక్కుతున్నారు. అసలు ఒకటే కేసులో రెండ్రెండు విచారణలు కొనసాగడం వింతల్లో కెల్లా వింత. గతంలో కేంద్ర సంస్థల దర్యాప్తు అంటే ఉగ్రవాదం వంటి జాతీయ భద్రతకు సంబంధించిన వ్యవహారాల్లోనే ప్రధానంగా జరిగేది. కానీ ఇప్పుడు ఇసుక తవ్వకాలు, పేపరు లీకులపై కూడా సీబీఐ, ఈడీ దర్యాప్తులు సాగిస్తున్నాయి. ఆ రెండు సంస్థల కేసుల్లో కొసకంటా కొనసాగి, నేరం రుజువై, శిక్షలు పడ్డవి ఎన్ని? ఈడీ గత పదేండ్ల కాలంలో 5,297 కేసులు దాఖలు చేస్తే అందులో ఇప్పటివరకు విచారణ పూర్తి చేసుకున్నవి కేవలం 43. అందులోనూ శిక్ష పడినవి 40 మాత్రమే. మిగతా వేలమంది విషయం ఏమిటనే ప్రశ్న ఎదురవుతున్నది. ప్రత్యర్థి పార్టీల నేతలను రాజకీయంగా లొంగదీసుకోవడమే కేసులు, విచారణలు, దర్యాప్తుల పరమోద్దేశం. బీఆర్ఎస్ నేతలకు కేసులు కొత్త కాదు. రాష్ట్ర సాధన కోసం జరిగిన సుదీర్ఘ ప్రస్థానంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న చరిత్ర వారికి ఉంది. రెండు జాతీయ పార్టీలకు ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్సే. అందుకే కక్షకట్టారు. కేసులు పెట్టారు. కాకలు తీరిన యోధులను తాటాకు చప్పుళ్లతో బెదిరించాలని చూస్తున్నారు. ప్రత్యర్థులను అష్ట దిగ్బంధనం చేస్తే ప్రశ్నించే గొంతులు మూగపోతాయని ఆశపడుతున్నారేమో. అది జరిగే పని కాదు. ఎన్నటికైనా ధర్మం నిలిచి వెలుగుతుంది. సత్యం గెలిచి తీరడం తథ్యం.

విలువలకు రేవంత్ తిలోదకాలు

బుద్ధా మురళి

> ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా విలువలతో కూడిన రాజకీయాల గురించి చక్కగా ప్రసంగించారు. అక్కడికే పరిమితం కాకుండా ఎంతోకొంత అమలుకు సైతం ప్రయత్నిస్తే అభినందనీయం. కానీ అలాంటి ప్రయత్నం మచ్చుకు కూడా కనిపించడం లేదు. ఒక రోజు రెండు సమావేశాలు ఉంటే ఒక సమావేశంలో రాజకీయాల్లో విలువల ఆవశ్యకత గురించి మాట్లాడి, మరో సమావేశంలో లాగుల్లో తొండలు విడుస్తామని ప్రత్యర్థి పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడితే ఇక విలువలు ఏం పాటిస్తున్నట్టు?

రాజకీయాల్లో సిద్ధాంతపరమైన భావజాలం కనిపించడం లేదని, పదవుల కోసమే పార్టీలు మారుతున్నారని మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చెప్పినట్టు రాజకీయాల్లో విలువలు లేని మాట వాస్తవం. పదవుల కోసమే పార్టీలు మారుతున్నారని ఆయన చెప్పింది అక్షర సత్యం. కానీ, ఒకవైపు తామే ఆ తప్పుడు పనులు చేస్తూ విలువలు లేవని ఆవేదన చెందడమే అసలు రాజకీయం. నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయ్యాక ప్రజాప్రతినిధులను చేర్చుకోవడంలో కొత్త రికార్డులు సృష్టించారు. అనేక రాష్ట్రాల్లో రాత్రికి రాత్రే పార్టీలను చీల్చి తమ పార్టీని అధికారంలో కూర్చోబెట్టారు. ప్రభుత్వం, ప్రతిపక్షం బాధ్యతాయుతంగా పనిచేయాలనే ఉద్దేశంతో పీఏసీ చైర్మన్‌గా ప్రతిపక్షానికి చెందిన సభ్యుడిని నియమిస్తారు. ప్రభుత్వాలను మార్చేసిన నరేంద్రమోదీ లాంటి వారు సైతం పీఏసీ చైర్మన్‌గా తమ వారిని నియమించే సాహసం చేయలేకపోయారు. కానీ, తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రం బీఆర్ఎస్ శాసనసభ్యుడు గాంధీని తమ పార్టీలో చేర్చుకుని పీఏసీ చైర్మన్‌ను చేసింది. అధిష్ఠానం వద్ద దీనిని తమ విజయంగా చూపించుకున్నారు.

1995లో ఎన్టీఆర్‌ను దించి చంద్రబాబు సీఎం పదవి చేపట్టిన తరువాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఎంగా అదే తొలి అధికారిక కార్యక్రమం. అక్కడ చంద్రబాబు మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు పడి పోతున్నాయని, విలువలతో కూడిన రాజకీయాల కోసం పని చేయాలని సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారు. నమ్మిన ఎన్టీఆర్‌కు పొడిచిన పోటు ఇంకా పచ్చిగా ఉండగానే బాబు మాత్రం నిర్మొహమాటంగా రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడారు.

సరిగ్గా రేవంత్‌రెడ్డి కూడా అదే విధంగా రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి టీడీపీ తెలంగాణ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎవరో రాసి ఇచ్చిన ఉపన్యాసాలు కాకుండా సొంతంగా మాట్లాడేవారు. ఒక టీవీ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ నుంచి అబద్ధాలు కోరుకుంటున్నారని, రోగి కోరిందే వైద్యుడు ఇచ్చాడన్నట్టు తాము అబద్ధాలు మాట్లాడుతున్నామని చెప్పుకొచ్చారు. సీఎం కాబట్టి ఇప్పుడు అధికారులు రాసిచ్చే ఉపన్యాసాల ప్రభావం వల్ల రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడుతున్నారు. విలువల గురించి మాట్లాడాలన్న ఉబలాటం మంచిదే కానీ, అదే సమయంలో ఎంతో కొంత విలువలు పాటించడం కూడా అవసరం. ఒక వైపు విలువలకు తిలోదకాలు ఇస్తూ మరో వైపు విలువలు పడిపోతున్నాయని ఆవేదన చూపించడం వల్ల ఏం ప్రయోజనం?

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని రేవంత్ అప్పట్లో ఆవేదన వ్యక్తంచేశారు. కానీ, ఇప్పుడు సూర్యాపేట నియోజక వర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పాల్వాయి రజనీకుమారిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా నియమించారు. 2004 ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. అంతకు ముందు ఆమె సూర్యాపేట మున్సిపల్ కమిషనర్. అప్పుడు అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ తిరిగి ఉద్యోగంలోకి తీసుకుంటామని చెప్పినా వెళ్లకుండా ఓడిపోయినా ఆమె టీడీపీలో చురుగ్గా పనిచేశారు. రేవంత్‌రెడ్డి దాదాపు అదే సమయంలో టీడీపీలోకి వచ్చారు. సీఎం కాగానే ఆమెకు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అవకాశం కల్పించారు. అప్పుడేమో సర్వీస్ కమిషన్‌ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని విమర్శించారు. ఇప్పుడు ఆయన అదే పనిచేస్తున్నారు.

రాజకీయాల్లో అమ్ముడం, కొనడం, అమ్ముడుపోవడం సర్వ సాధారణం కానీ, ప్రజాప్రతినిధిని కొనుగోలు చేయడానికి నగదుతో వెళ్లి పట్టుబడిన ఘనత దేశంలో మొదటిసారి రేవంత్‌కే దక్కింది. పార్టీ మార్పిడి నిరోధక చట్టం ఉన్నా శాసన సభ్యులు యథేచ్ఛగా పార్టీలు మారుతున్నారు. అలా మారిన వారికి పదవులు వస్తున్నా, తాము పార్టీ మారినట్టు చెప్తున్నా ఏమీ కానప్పుడు ఖర్చు గురించి మాట జారితే ఏమవుతుంది.

మనిషి తాను ఏదైతే కాదో అది చెప్పడానికి ప్రయత్నిస్తాడని అంటాడు ఓషో. విలువలు ఏమాత్రం లేని, పాటించని రాజకీయ వ్యాపారంలో రాజకీయ నాయకులు విలువల గురించి ఎక్కువగా మాట్లాడుతారు. బిల్వమంగళుడిని నిండా ముంచేసిన తరువాత చింతామణి సుభాషితాలు చెప్పినట్టు విలువలకు తిలోదకాలు ఇచ్చి కేవలం ఉపన్యాసాల్లో మాత్రమే విలువలు మిగిలితే ఏం ప్రయోజనం!

పనిగంటలు దేశగతిని మారుస్తాయా?

నాంచారయ్య మెరుగుమాల

> ఒకరేమో వారానికి 70 గంటలు పనిచేయమంటారు. మరొకరు ఇంకో అడుగు ముందుకేసి 90 గంటలు పనిచేయమంటారు. దేశం అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉన్న ఒకే ఒక్క మంత్రం ఇదేనంటారు. కానీ, వారానికి 48 గంటలు పనిచేస్తూనే ప్రపంచం నివ్వెరపోయే ప్రగతి సాధించామన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు. అంతేకాదు, రోజంతా ఆఫీసుల్లోనే ఉండి రోబోల్లా పనిచేస్తూ పోతే దేశం అభివృద్ధి సంగతి దేవుడెరుగు, తలెత్తే మానసిక, ఆరోగ్య సమస్యల సంగతేంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతుందన్న విషయాన్ని వారు మర్చిపోతున్నారు.

ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేస్తే దేశం గొప్ప పురోగతి సాధిస్తుందని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి గతంలో ప్రకటించి దేశవ్యాప్త చర్చకు కారణమయ్యారు. తాజాగా, ఎల్‌అండ్‌టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ ఒకడుగు ముందుకు వేసి వారానికి 90 గంటలు పనిచేయాలని సెలవిచ్చి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశారు. నిజానికి ఫ్యాక్టరీల చట్టం 1948 ప్రకారం వారానికి 48 గంటలు మించి పనిచేయకూడదు. ఈ చట్టాలను అనుసరిస్తూనే 75 ఏండ్లలో దేశం అనూహ్య ప్రగతి సాధించింది. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరు కార్పొరేట్ దిగ్గజాలు భారత శ్రామికులను వారానికి 70 నుంచి 90 గంటలు పనిచేయాలని సూచించడం ఎంత మాత్రం హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా కనిపించడం లేదు. సుబ్రహ్మణ్యన్ చెప్తున్న దాని ప్రకారం వారానికి 90 గంటలు పనిచేయడమంటే రోజుకు 12 గంటలకు పైగా శ్రమపడాల్సి ఉంటుంది. నారాయణమూర్తి 70 గంటల ప్రతిపాదనను ఎంతోమంది విమర్శించారు. ఇప్పుడు సుబ్రహ్మణ్యన్ అంతకుమించి విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియా ఆయనపై జోక్స్, మీమ్స్‌తో విరుచుకుపడింది. గతంలో ఎలాన్ మస్క్, జాక్ మా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసి విమర్శల పాలయ్యారు.

48 గంటల పని విధానం దేశంలో కొనసాగుతున్నప్పటికీ నగర, పట్టణ ప్రాంతాల్లోని కంపెనీ ఉద్యోగులు తగిన వేతనం పొందకుండానే పరిమితికి మించి పనిచేస్తున్న మాట వాస్తవం. ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ దేశాన్ని ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి తీసుకెళ్లారు. సాధారణ పనిదినాల అమలు చట్టాలు వర్తించని రీతిలో 88 శాతం మంది భారత ఉద్యోగులను కంపెనీలు నియమించుకుంటున్నాయని ఇండీడ్ అనే గ్లోబల్ సంస్థ సర్వేలో తేలింది. ప్రభుత్వ సెలవు దినాలు, సిక్ లీవ్‌లో ఉన్నప్పుడు కూడా కంపెనీ యాజమాన్యాలు తమతో పనిచేయించుకుంటున్నాయని 85 శాతం మంది ఉద్యోగులు చెప్పినట్టు సర్వే పేర్కొన్నది. విధులు ముగిశాక యాజమాన్యాలు పంపే సందేశాలకు స్పందించకుంటే ప్రమోషన్లు వంటి ప్రయోజనాలను ఎక్కడ కోల్పోతామోనన్న భయం ఉద్యోగులను వెంటాడుతూ ఉంటుంది. కొన్ని రంగాల్లో ఉద్యోగులు ఇప్పటికే పనికి సంబంధించి కంపెనీ ఆదేశాలు పాటించేందుకు రోజంతా అందుబాటులో ఉంటున్నారు. కొందరు అదనపు జీతభత్యాలు పొందకుండానే నిర్దేశిత పని గంటలకు మించి శ్రమపడుతున్నారు. కానీ, పదిహేను అగ్రశ్రేణి గ్లోబల్ టెక్ కంపెనీల ఉద్యోగులు వారానికి 50 గంటల లోపే పనిచేస్తుండటం గమనార్హం. 'ఓవర్‌టైమ్' కారణంగా అత్యధిక మరణాలు సంభవించే దేశాల్లో ఇండియా ముందు వరుసలో ఉందని అంతర్జాతీయ కార్మిక సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్త సర్వేలో వెల్లడైంది.

సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో ఎల్‌అండ్‌టీ స్పందించింది. అసాధారణ ఫలితాలు సాధించేందుకు అసాధారణ ప్రయత్నాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడానికి మాత్రమే సుబ్రహ్మణ్యన్ ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పుకొచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఇండియాను ముందుకు తీసుకెళ్లడానికి మరింత అంకితభావంతో పనిచేయాలనేదే ఎల్ అండ్ టీ లక్ష్యమని, కంపెనీ ఉద్దేశాన్ని, విస్తృత లక్ష్యాలను చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇక నారాయణమూర్తి వారానికి 70 గంటల పని విధానం ప్రతిపాదనపై ప్రముఖ ఐటీ కంపెనీ జోహో కార్పొరేషన్ సీఈవో శ్రీధర్ వెంబూ తీవ్రంగానే స్పందించారు.

> 'జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనాలు మితిమీరిన శ్రమతో అభివృద్ధి సాధించాయి. ఇవి తమ ప్రజలను శిక్షించే స్థాయిలో పనిభారం మోపాయి. ఆఫీసుల్లో, ఫ్యాక్టరీల్లో రెక్కలుముక్కలు చేసుకుని జనం పనిచేసిన కారణంగా ఈ దేశాల్లో జనాభా బాగా తగ్గిపోతున్నది. ఫలితంగా అక్కడి ప్రభుత్వాలే ప్రజలను ఇంకా ఎక్కువ పిల్లలను కనండి అని వేడుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది' అని విరుచుకుపడ్డారు.

ఎక్కువ గంటలు కష్టపడి పనిచేస్తూ అభివృద్ధి సాధించిన దేశాల్లోని ప్రజలు వృద్ధాప్యంలో ఒంటరిగా బతకాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. కంపెనీల రథసారథులు కొద్దిమంది ఎక్కువ గంటలు పనిచేస్తే చాలని, ఉద్యోగులంతా ఒళ్లు హూనం చేసుకుని శ్రమిస్తే వ్యతిరేక ఫలితాలు తప్పవని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక ప్రగతిలో ఇండియాకు చైనా ఎన్నటికీ ఆదర్శం కాకూడదని వెంబూ చేసిన హెచ్చరిక హేతుబద్ధంగా కనిపిస్తున్నది.

మూర్తి, సుబ్రహ్మణ్యన్ చెప్పినట్టు రోజుకు అందరూ సగటున పది గంటలు పనిచేస్తే ఆయుష్షు కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నదని చెప్తున్నారు. అధిక పనిగంటల వల్ల మానసిక, శారీరక ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడు సామాజిక జీవితం అంటూ ఏమీ మిగలదన్నది అత్యధికుల మాట. భారత శీఘ్ర ఆర్థిక ప్రగతికి ఈ ఇద్దరు దక్షిణాది కార్పొరేట్ దిగ్గజాలు ఒకే తీరున సూచించిన పరిష్కార మార్గాలను పరిశీలిస్తే ఇండియాలో 1970, 80లలో ప్రచారంలో ఉన్న ఒక వింత పుక్కిటి పురాణం పాత తరం వారికి గుర్తుకొస్తున్నది. అప్పట్లో జపాన్ అనేక రంగాల్లో అమెరికా, ఐరోపా దేశాలను తలదన్నే రీతిలో ఆర్థికాభివృద్ధి సాధించడం మొదలైంది. దానికి కారణం జపాన్‌లో కార్మికులకు కంపెనీల యాజమాన్యాలపై అసంతృప్తి, ఆగ్రహం వస్తే పని బంద్ చేసి సమ్మెలకు దిగకుండా ఫ్యాక్టరీల్లో ఎక్కువ గంటలు పని చేసేవారనే ప్రచారం దేశవ్యాప్తంగా నడిచింది.



నాసిరకం రోడ్లు నిర్మిస్తే నాన్ బెయిలబుల్ కేసు!

> నాసిరకం రోడ్ల నిర్మాణాన్ని నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణించాలి. రోడ్డు కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, సంబంధిత రాయితీదారులను ఇందుకు బాధ్యులను చేసి వారిని జైలుకు పంపించాలి.

- నితిన్ గడ్కరీ
కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి

పసుపు బోర్డు ముందు సవాళ్లు ఎన్నో..

> నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు వెనక బీఆర్ఎస్ కృషి అడుగడుగునా ఉన్నది. ఉమ్మడి ఏపీలో కేసీఆర్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడే పసుపు బోర్డు డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. ఆ తర్వాత కవిత కూడా దీనిపై పోరాటం చేశారు. పసుపు రైతులు, బీఆర్ఎస్ కలిసి చేసిన పోరాటాలతో ఉలిక్కిపడిన బీజేపీ గత ఎన్నికల్లో ఇదే అంశంతో నిజామాబాద్ పార్లమెంటు బరిలో దిగి విజయం సాధించినప్పటికీ ఆ తర్వాత ఆ విషయాన్ని అటకెక్కించింది.

పసుపు బోర్డు ఏర్పాటు అంశంలో బీఆర్ఎస్ పాత్ర చాలా కీలకం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేసీఆర్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పసుపు బోర్డు కోసం అప్పటి కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు డిమాండ్ చేశారు. 2014లో రాష్ట్ర ఏర్పాటు తర్వాత వ్యవసాయ రంగంపై బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా పసుపు బోర్డు ఏర్పాటు అంశాన్ని తెరపైకి తీసుకొచ్చి కేంద్రంపై ఒత్తిడి పెంచింది. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ సభ్యులు పలుమార్లు దీనిపై చర్చకు పట్టుబట్టారు. నిజామాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు కవిత అధ్యక్షతన ప్రధాని నరేంద్రమోదీని కలిసి వినతులు ఇచ్చారు. కానీ కేంద్రం మాత్రం స్పందించలేదు. ఇక్కడ బోర్డు ఏర్పాటు చేస్తే ఇతర బోర్డులపై ప్రభావం పడుతుందని వాదించింది. అయితే, 2019 సార్వత్రిక ఎన్నికల్లో నిజామాబాద్‌లో ఇదే ప్రధానాంశమైంది. ఆ ఎన్నికల్లో అక్కడ బీజేపీ గెలిచిన తర్వాత మళ్లీ ఈ అంశం మరుగున పడింది. అయితే, రైతుల నుంచి ఆందోళనలు తీవ్రతరం కావడం, ఆర్మూర్, జగిత్యాల ప్రాంతాల్లో రైతులు ఆందోళనలకు దిగడం, మరోవైపు బీఆర్ఎస్ ఒత్తిడి వెరసి పసుపు బోర్డుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నో పోరాటాలు, మరెన్నో వినతుల తర్వాత తెలంగాణలో పసుపు బోర్డును ఎట్టకేలకు ప్రారంభించింది.

> పసుపు ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణది మొదటి స్థానం. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలో పసుపు అధికంగా పండిస్తారు. పండిన పంటను ఇతర రాష్ట్రాలకు పంపించి అక్కడి నుంచి ఎగుమతి చేసేవారు. దీనివల్ల మన రైతులకు సరైన ధర లభించక నష్టపోయేవారు. 2016-17లో అప్పటి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలు కవిత అనేకసార్లు కేంద్ర పెద్దలను కలిసి పసుపు బోర్డు కోసం వినతులు ఇచ్చారు. అయితే, 2022లో పసుపు బదులు సుగంధ ద్రవ్యాల బోర్డును ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇప్పుడు ఎట్టకేలకు తెలంగాణ భౌగోళిక, ఆర్థిక లబ్ధి తదితర అంశాల దృష్ట్యా కేంద్రం ఎట్టకేలకు పసుపు బోర్డును ప్రారంభించింది.

మన రాష్ట్రంలో దాదాపు 25 రకాల పసుపును పండిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆయుష్ మంత్రిత్వశాఖ ప్రపంచ సంప్రదాయ మందుల కేంద్రం (గ్లోబల్ ట్రెడిషనల్ మెడిసినల్ సెంటర్) ద్వారా పసుపునకు ప్రోత్సాహకాలు కల్పించే అవకాశాలున్నాయి. ఔషధ గుణాలు అధికంగా ఉన్నందువల్ల అనేక ఆహార, ఔషధ రంగాల పరిశ్రమలకు ఒక థింక్ ట్యాంక్‌గా ఈ బోర్డు పనిచేయనుంది. ఉద్యోగ కల్పన, గ్రామీణ సహకార సంఘాలకు పెట్టుబడి సాయం, గ్రామీణ నిరుద్యోగ నిర్మూలన వంటివి జరగనున్నాయి. అలాగే, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని ప్రాంతీయ బోర్డులకు ఇది కేంద్రంగానూ పనిచేయనుంది. రైతుల కన్నార్షియం ద్వారా అధిక లాభాలకు కూడా ఇది దోహదం చేస్తుంది. భారత్ తర్వాత ప్రపంచంలో అత్యధికంగా పసుపును పండించే దేశాలైన చైనా, మయన్మార్, నైజీరియా దేశాలతో మనం ఎంపోయూ కుదుర్చుకొనే అవకాశాలు కూడా మెరుగుపడతాయి. లాజిస్టిక్స్ హబ్ , రవాణా సౌకర్యాలు సైతం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

బోర్డు ఏర్పాటుతో పాటు ఒక పరిశోధన కేంద్రం, ఎగుమతి ప్రోత్సాహక వృద్ధి కేంద్రాలు (ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ గ్రోత్ కౌన్సిల్), సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రైతులకు పసుపుపై మద్దతు ధర (ఎంఎస్పీ)ను అధికంగా ప్రకటించినప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. మన రాష్ట్రంలో పసుపును అధికంగా పండిస్తున్నప్పటికీ పసుపు వంగడాలు మాత్రం కర్ణాటక, తమిళనాడు నుంచే వస్తున్నాయి. కాబట్టి బోర్డు ఇక్కడ ఉన్నప్పటికీ అక్కడి రైతులకు అధికంగా లబ్ధి చేకూరే అవకాలున్నాయి. ఈ సవాళ్లను బోర్డు ఎలా అధిగమిస్తుందో చూడాలి. తెలంగాణ భూపరివేష్టిత (ల్యాండ్ లాక్డ్) రాష్ట్రం కావడం వలన ఎగుమతులకు కొంత అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. దీనికి తగ్గట్టుగా డ్రై పోర్టులను నిజామాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే, ట్రాన్సిట్ కారిడార్లను ఏర్పాటు చేయాలి. ఆర్గానిక్ రకమైన పసుపు విత్తనాలను సైతం ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఈ విధంగా దేశంతో పాటు మన రాష్ట్ర రైతులకు లబ్ధి చేకూరేలా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జాతీయ పసుపు బోర్డు ముందుకు సాగాలని కోరుకుందాం.

కన్నోజు శ్రీహర్ష
89851 30032